


# కరపత్రం

SINCE 2014

శనివారం జనవరి 18 2025 | సంపుటి :0 | సంచిక : 97 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4

## అఫ్జల్‌గంజ్‌లో కాల్పులు..

### రిఅమిత్ కుమార్ గ్యాంగ్ కోసం పోలీసుల వేట



**కలకలం రేపిన అఫ్జల్‌గంజ్ కాల్పుల కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. అఫ్జల్‌గంజ్‌లో కాల్పుల అనంతరం పరారవుతున్న నిందితులు**

హైదరాబాద్: కలకలం రేపిన అఫ్జల్‌గంజ్ కాల్పుల కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. పది ప్రత్యేక బృందాలతో హైదరాబాద్ సహా రాయ్‌పుర్, బిహార్‌తో పాటు అనుమానిత ప్రాంతాల్లో పోలీసుల గాలింపు కొనసాగుతోంది. కాల్పులు జరిపింది బిహార్‌కు చెందిన అమిత్ కుమార్ ముఠాగా పోలీసులు గుర్తించినట్టు సమాచారం.బీదర్‌లో దోపిడీకి పాల్పడి అక్కడ ఇద్దరిపై కాల్పులు జరిపి.. నగరంలోకి ప్రవేశించి ఇక్కడ నుంచి రాయ్‌పుర్ మీదుగా పారిపోవాలని ప్రయత్నించినట్టు పోలీసులు గుర్తించారు. దొంగలు హైదరాబాద్‌కు ఎలా చేరుకున్నారనే అంశంపై పోలీసులు దృష్టి సారించారు. కాల్పులు జరిపిన ముఠా బిహార్ పారిపోయిందా అనే కోణంలోనూ పోలీసులు విచారణ జరుపుతున్నారు. ముఠాలో ప్రధానంగా అమిత్‌కుమార్ కీలకంగా ఉన్నట్టు.. అతనిపై బిహార్‌లో దోపిడీ, దొంగతనం వంటి పలు కేసులు ఉన్నట్టు గుర్తించారు. సీసీఎస్, టాస్క్‌ఫోర్స్, శాంతిభద్రతల విభాగం పోలీసులు నిందితుల కోసం వేట కొనసాగిస్తున్నారు.

2లో

## కలర్స్ హెల్త్‌కేర్‌కు చుక్కెదురు.. అప్పీల్‌ను కొట్టేసిన వినియోగదారుల కమిషన్




కేంద్ర ఆరోగ్యశాఖ నుంచి కలర్స్ హెల్త్‌కేర్‌కు తగిన అనుమతులు లేవని రాష్ట్ర వినియోగదారుల కమిషన్ తేల్చి చెప్పింది.

హైదరాబాద్: కేంద్ర ఆరోగ్యశాఖ నుంచి కలర్స్ హెల్త్‌కేర్‌కు తగిన అనుమతులు లేవని రాష్ట్ర వినియోగదారుల కమిషన్ తేల్చి చెప్పింది. ఆ సంస్థకు ఉన్న అనుమతులపై 2 నెలల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. ఈ మేరకు హైదరాబాద్ డీఎంహెచ్‌ఓ, వైద్య విధాన పరిషత్ డైరెక్టర్‌ను ఆదేశించింది.

అసలేం జరిగిందంటే..

కలర్స్ హెల్త్‌కేర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు సంగారెడ్డి జిల్లా వినియోగదారుల కోర్టు జరిమానా విధించింది. బరువు, కొవ్వు తగ్గిస్తామంటూ మోసం చేశారని సంగారెడ్డికి చెందిన ఓ యువతి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కోర్టు విచారణ చేపట్టింది. యువతి చెల్లించిన రూ.1,05,000.. తొమ్మిది శాతం వడ్డీతో చెల్లించాలని ఆదేశించింది. జిల్లా వినియోగదారుల కోర్టు ఇచ్చిన తీర్పును కలర్స్ హెల్త్ కేర్ అప్పీల్ చేసింది. దీనిపై విచారణ చేపట్టిన రాష్ట్ర వినియోగదారుల కమిషన్ అప్పీల్‌ను కొట్టేసింది.

## సీఎం రేవంత్ సింగపూర్ పర్యటన.. ఐటీఈతో స్కిల్ యూనివర్సిటీ ఒప్పందం



సింగపూర్: సీఎం రేవంత్‌రెడ్డి సింగపూర్‌లో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో అక్కడి ఐటీఈతో(ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్) తెలంగాణలోని యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఒప్పందం చేసుకుంది. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది. ఇందులో భాగంగా ఐటీఈ పాఠ్యాంశాలను స్కిల్ వర్సిటీ ఉపయోగించుకోనుంది. ఈమేరకు స్కిల్ వర్సిటీ వీసీ, ఐటీఈ డిప్యూటీ డైరెక్టర్ మధ్య ఒప్పందం కుదిరింది. శుక్రవారం ఉదయం సింగపూర్ విదేశాంగ మంత్రి వివియన్ బాలకృష్ణన్‌తో రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. గ్రీన్ ఎనర్జీ, మూసీ పునరుజ్జీవనం, పర్యాటకం, విద్య, ఐటీ, నైపుణ్య నిర్మాణంపై వారు చర్చించారు. సీఎంతో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ భేటీలో పాల్గొన్నారు.

## సింగపూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన.. ఆ దేశ విదేశాంగ మంత్రితో భేటీ

సింగపూర్: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సింగపూర్‌లో పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా ఆ దేశ విదేశాంగ మంత్రి వివియన్ బాలకృష్ణన్‌తో భేటీ అయ్యారు. గ్రీన్ ఎనర్జీ, మూసీ పునరుజ్జీవనం, పర్యాటకం, విద్య, ఐటీ, నైపుణ్య నిర్మాణంపై వారు చర్చించారు. సీఎంతో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు,

2లో



## గత ప్రభుత్వం చేసింది వడ్డీ మాఫీనే: ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సన్నాలు పండిస్తే తెలంగాణలో రైతులకు రూ.500 బోనస్ ఇస్తున్నట్లు కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తెలిపారు.

హైదరాబాద్: సన్నాలు పండిస్తే తెలంగాణలో రైతులకు రూ.500 బోనస్ ఇస్తున్నట్లు కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తెలిపారు. దేశంలో ఎక్కడా రూ.500 బోనస్ ఇవ్వట్లేదని చెప్పారు. హైదరాబాద్‌లోని సీఎల్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రేషన్ కార్డుల జారీని గత ప్రభుత్వం మర్చిపోయిందని విమర్శించారు. ఈ నెల 26 నుంచి వీటి జారీ కార్యక్రమం జరుగుతుందని వివరించారు."గత ప్రభుత్వం రుణమాఫీ చేయలేదు.. వడ్డీ మాఫీ చేసింది. వరంగల్ డిక్లరేషన్‌లో ఇచ్చిన మాట ప్రకారమే రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశాం. రుణమాఫీ కోసం కేంద్రం నుంచి రూ.10 వేల కోట్లు సాయం చేసి ఉంటే ప్రభుత్వానికి ఉపయోగపడేది" అని జీవన్‌రెడ్డి తెలిపారు.



## ఇంటర్ విద్యార్థులకు అలర్ట్.. 25వ తేదీ వరకు ఫీజు చెల్లింపునకు అవకాశం

హైదరాబాద్ : ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ విద్యార్థులను ఇంటర్మీడియట్ బోర్డు అప్రమత్తం చేసింది. వార్షిక పరీక్షలకు సంబంధించిన ఫీజును ఇప్పటికీ చెల్లించని విద్యార్థులు.. ఆలస్య రుసుం రూ. 2500తో జనవరి 25వ తేదీ వరకు చెల్లించేందుకు అవకాశం కల్పించింది. ఇంటర్ రెగ్యులర్, వొకేషనల్ విద్యార్థులతో పాటు ప్రయివేటు విద్యార్థులు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించింది.

2లో

## భాష మార్చుకోవాల్సింది నేను కాదు..సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్: భాష మార్చుకోవాల్సింది తాను కాదని.. సీఎం రేవంత్ రెడ్డి అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌషిక్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తనపై అక్రమ కేసులు బనాయిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హామీలపై ప్రశ్నిస్తున్నందుకే కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. పోలీసు విధులకు ఆటంకం కలిగించారన్న కేసులో మాసబ్‌ట్యాంక్ సీఐ ఎదుట కౌశిక్ రెడ్డి విచారణకు హాజరయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పోలీసులు తనను గంటపాటు విచారించారని, 32 ప్రశ్నలు అడిగారన్నారు. అడిగిన ప్రశ్నలనే మళ్లీ అడిగారని చెప్పారు.



2లో

## ఫ్రీ బస్సు పేరుతో మగపిల్లలకు ఇజ్జత్ లేకుండా చేసిండు..

## రేవంత్‌పై మండిపడ్డ మహిళ



రంగారెడ్డి : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలనపై రాష్ట్రంలోని మహిళలందరూ తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఎందుకంటే తమకు ఇచ్చిన ఒక్క హామీని కూడా సంపూర్ణంగా అమలు చేయకపోవడమే. ఒక్క ఫ్రీ బస్సు అమలు చేసి.. బస్సుల్లో కొట్లాటలు పెట్టాడని రేవంత్ సర్కార్‌పై మహిళలు నిప్పులు చెరుగుతున్నారు.

ఇవాళ రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ రైతు ధర్నా సభలో ఓ మహిళా రైతు.. రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కడిగి పారేసింది. నాకు నాలుగు ఎకరాల పొలం ఉంది.. క్రాప్ లోన్ రూ. 54 వేలు తీసుకున్నాను.. కానీ రుణమాఫీ కాలేదు నాకు. అందరికీ రుణమాఫీ అయిందని ముఖ్యమంత్రి అబద్ధం చెబుతున్నాడు. అందరికీ మాఫీ అయింది కానీ మాకు కాలేదు. రూ. 500కే గ్యాస్ అన్నాడు.. కానీ రూ. 900 తీసుకుంటున్నరు. తిరిగి రూ. 400 మా ఖాతాలో పడట్లేదు. రైతుబంధు కూడా రాలేదు. ఫ్రీ బస్సులో పోతలేను. అది ఒక్కటి నడుస్తున్నది. తులం బంగారంలేదు. రూ. 2500 లేవు. మా ఆయనకు కేసీఆర్ 2 వేల పెన్షన్ ఇచ్చిండు. ఇప్పుడు ఆ నాలుగు వేల పెన్షన్ ఎక్కడ పోయిందో. పుల్ల గీసి అంటుపెట్టాలి.. మరి ఏం మంచిగ జేస్తుండు.. ఫ్రీ బస్సు అని మగపిల్లలకు ఇజ్జత్ లేకుండా చేసిండు. అది పద్ధతి కాదు అని రేవంత్ రెడ్డి సర్కార్‌పై మహిళా రైతు చెన్నమ్మ రుసరుసలాడారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శనివారం జనవరి 18 2025

# మెట్రో రైళ్లలో విద్యార్థులకు 50 శాతం రాయితీ ఇవ్వండి.. ప్రధానికి కేజ్రీవాల్ లేఖ

దిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రధాని మోదీకి లేఖ రాశారు. విద్యార్థుల గురించి అందులో ప్రస్తావించారు.

దిల్లీ: అసెంబ్లీ ఎన్నికల తేదీ దగ్గరపడుతోన్న కొద్దీ దిల్లీలోని పార్టీలన్నీ తమ వ్యూహాలకు పదునుపెడుతున్నాయి. అలాగే ఓటర్లను ఆకట్టుకునేలా ముందుకు అడుగులు వేస్తున్నారు. ఈక్రమంలో ప్రధాని మోదీ కి ఆప్ అధినేత, దిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ లేఖ రాశారు. దేశ రాజధాని పరిధిలోని మెట్రో రైళ్లలో ప్రయాణించే పాఠశాల, కళాశాల విద్యార్థులకు 50 శాతం టికెట్ రాయితీని అమలుచేయాలని కోరారు. రాయితీ కారణంగా పడే భారాన్ని రాష్ట్రం, కేంద్ర ప్రభుత్వం 50:50 నిష్పత్తిలో భరించాలని ప్రతిపాదన చేశారు



"దిల్లీ విద్యార్థులకు సంబంధించి ముఖ్యమైన విషయాన్ని మీ దృష్టికి తీసుకువచ్చేందుకు ఈ లేఖ రాస్తున్నాను. విద్యాసంస్థలకు వెళ్లి వచ్చే క్రమంలో విద్యార్థులు మెట్రోపై ఆధారపడుతున్నారు. వారిపై ఆర్థికభారాన్ని దించేందుకు 50 శాతం రాయితీ అందించాలని ప్రతిపాదిస్తున్నాను" అని కేజ్రీవాల్ ఆ లేఖలో పేర్కొన్నారు. అలాగే తాము అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని చెప్పారు. ఇప్పటికే మహిళా ప్రయాణికులు బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తోన్న విషయాన్ని గుర్తుచేశారు.

ఆప్ గెలిస్తే.. మద్యం పాలసీ అమలు తప్పదు: భాజపా

దిల్లీ ఎయిమ్స్ రోగులకు ఇలాంటి దుస్థితా..?

కేంద్రం, దిల్లీ ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. దిల్లీ ఎయిమ్స్ రోగులు, వారి బంధువులు ఎదుర్కొంటున్న దుస్థితి గురించి ఓ వీడియోను షేర్ చేసి ఆగ్రహం వ్యక్తంచేశారు. చికిత్స కోసం రోగులు నెలలతరబడి వేచిచూడాల్సి వస్తున్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. రోగుల బంధువులు వణికే చలిలో ఫుట్‌పాత్, సబ్‌వేలపై నిద్రపోవాల్సిన దుస్థితి నెలకొందని వ్యాఖ్యానించారు. గురువారం రాత్రి ఆ కుటుంబాలను రాహుల్ పరామర్శించారు.

## గర్భిణీలకు రూ.21వేలు.. దిల్లీ భాజపా మేనిఫెస్టో విడుదల



ఇంటర్నెట్ డెస్క్: దిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి భాజపా మేనిఫెస్టోను ప్రకటించింది. 'సంకల్ప పత్రా' పార్ట్-1 పేరుతో భాజపా జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా పార్టీ మేనిఫెస్టోను ప్రకటించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే.. గర్భిణీలకు రూ.21వేల ఆర్థిక సాయం, పేద కుటుంబాలకు సబ్సిడీపై ఎల్పీజీ సిలిండర్లను రూ.500కే ఇస్తామని పేర్కొన్నారు. 'మహిళా సమృద్ధి యోజన' కింద దిల్లీలోని మహిళలకు నెలకు రూ.2500 ఆర్థిక సాయాన్ని అందిస్తామన్నారు. వీటితోపాటు ప్రస్తుతం ఉన్న అన్ని సంక్షేమ పథకాలను కొనసాగిస్తామని హామీ ఇచ్చారు.

గర్భిణీలకు రూ.21వేల ఆర్థిక సాయం. ఆరు పౌష్టికాహార కిట్లు. ప్రస్తుతం ఇస్తున్న మొదటి సంతానం సమయంలో రూ5వేలు, రెండో సంతానానికి రూ.6వేలకు ఇవి అదనం

'మహిళా సమృద్ధి యోజన' కింద దిల్లీలోని మహిళలకు నెలకు రూ.2500 ఆర్థిక సాయం

దిల్లీలో ఆయుష్మాన్ భారత్ అమలు. దీనికి అదనంగా రూ.5లక్షల ఆరోగ్య కవరేజీ

పేద కుటుంబీలకు రూ.500లకే ఎల్పీజీ సిలిండర్, ప్రతి హెూలీ, దీపావళి (ఒకటి చొప్పున) పండగల సమయంలో ఉచితంగా గ్యాస్ సిలిండర్

60-70ఏళ్ల వయోవృద్ధులకు రూ.2500 పెన్షన్, 70ఏళ్ల పైబడిన వారికి రూ.3000

జేజే క్లస్టర్లలో అటల్ క్యాంటీన్‌ల ఏర్పాటు. రూ.5కే భోజనం

సంక్షేమ పథకాల అమల్లో వస్తున్న అవినీతి ఆరోపణలపై దర్యాప్తు

## బీజాపూర్‌లో కొనసాగుతున్న ఎదురు కాల్పులు.. నారాయణపూర్‌లో ఐఈడీ పేల్చిన నక్సల్స్



**ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో నక్సల్స్ ఐఈడీ పేల్చారు. ఈ ఘటనలో ఇద్దరు జవాన్లకు గాయాలయ్యాయి.**

నారాయణపూర్: ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో నక్సల్స్ ఐఈడీ పేల్చారు. ఈ ఘటనలో ఇద్దరు జవాన్లకు గాయాలయ్యాయి. ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని బీజాపూర్ జిల్లాలో గురువారం మావోయిస్టులు, భద్రతా బలగాలకు మధ్య భీకర ఎదురు కాల్పులు జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో 17 మంది మావోయిస్టులు మృతి చెందారు. మరోవైపు శుక్రవారం కూడా ఇక్కడ ఎదురు కాల్పులు కొనసాగుతున్నాయి. దక్షిణ బస్తర్ అడవుల్లో పెద్దఎత్తున మావోయిస్టులు ఉన్నారనే నిఘా వర్గాల సమాచారంతో బీజాపూర్, సుక్మా, దంతెవాడ జిల్లాల నుంచి డీఆర్‌జీ(డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్), కోబ్రా 204, 205, 206, 208, 210, సీఆర్పీఎఫ్ 229 బెటాలియన్లకు చెందిన సుమారు 1,500 మంది వరకు జవాన్లు గురువారం దండకారణ్యంలో కూంబింగ్ చేపట్టారు. ఈక్రమంలో ఇరువర్గాల మధ్య ఉదయం నుంచి సాయంత్రం వరకు భారీ ఎదురుకాల్పులు జరగ్గా 17 మంది మావోయిస్టులు మృతిచెందినట్లు తెలుస్తోంది. ఘటనా ప్రాంతం నుంచి ఒక ఎస్ఎల్ఆర్‌తోపాటు పెద్దఎత్తున ఆయుధ సామగ్రిని భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఈ విషయాన్ని పోలీసులు అధికారికంగా ధ్రువీకరించలేదు.


## భారత్ పెట్టుబడులకు స్వర్గధామం: ప్రధాని మోదీ

భారత్ మొబిలిటీ ఎక్స్ పో 2025ను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు.

దిల్లీ: దేశంలో ఎలక్ట్రిక్ మొబిలిటీ విస్తరణకు ప్రభుత్వం విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. దిగ్గజ వ్యాపారవేత్తలు రతన్ టాటా, ఒసాము సుజుకీ భారతదేశ ఆటో రంగం వృద్ధికి.. మధ్యతరగతి ప్రజల కలను నెరవేర్చడానికి ఎంతో సహకారం అందించారని అన్నారు. భారత్ పెట్టుబడులకు స్వర్గధామమని.. మొబిలిటీ రంగంలో తమ భవిష్యత్తును రూపొందించుకోవాలని చూస్తున్న ప్రతీ పెట్టుబడిదారుడికి భారతదేశం అత్యుత్తమ గమ్యస్థానంగా నిలుస్తుందని అన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ 'భారత్ మొబిలిటీ ఎక్స్ పో 2025'ను ప్రారంభించారు. గ్రీన్ టెక్నాలజీ, ఈవీలు, హైడ్రోజన్ ఇంధనం, జీవ ఇంధనాల అభివృద్ధిపై భారతదేశం దృష్టిసారిస్తోందన్నారు. మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం దేశంలో ఆటో పరిశ్రమ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిందన్నారు. ఈ దశాబ్దం చివరికి ఎలక్ట్రిక్ వాహనాలఅమ్మకాలు ఎనిమిది రెట్లు పెరుగుతాయని అన్నారు.

5 ఏళ్ల క్రితం ప్రారంభించిన ఫ్రేమ్-2 పథకం కింద రూ.8000 కోట్లకు పైగా సబ్సిడీగా ఇచ్చామని ప్రధాని పేర్కొన్నారు. దీంతో 16 లక్షలకు పైగా ఎలక్ట్రిక్ బస్సులు ఏర్పాటుచేశామన్నారు. దిల్లీలోనే 1200 కంటే ఎక్కువ ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయని తెలిపారు. ఒకప్పుడు భారతదేశంలో నాణ్యమైన రోడ్లు లేకపోవడంతో ప్రజలు కార్లు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపకపోయేవారని



ప్రధాని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితి మారుతుండటంతో కార్లకు డిమాండ్ పెరుగుతోందన్నారు. ఏడాదికి దాదాపు 2.5 కోట్ల కార్లు విక్రయమవుతున్నాయని తెలిపారు.

పెరుగుతున్న మధ్యతరగతి, వేగవంతమైన పట్టణీకరణ, సరసమైన వాహనాలు భారతదేశంలో ఆటో రంగాన్ని ముందుకు తీసుకువెళుతున్నాయని ప్రధాని పేర్కొన్నారు. దాదాపు 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని, వీరు వాహనాలను కొనుగోలు చేయాలనుకుంటున్నారని ప్రధాని మోదీ చెప్పారు. ఈవీలను ప్రోత్సహించడానికి పలు ప్రాంతాల్లో ఛార్జింగ్ పాయింట్లను ఏర్పాటుచేశామన్నారు.

దేశ రాజధానిలోని భారత మండపంలో నేడు ప్రారంభమైన 'భారత్ మొబిలిటీ ఎక్స్ పో.. 22వ తేదీ వరకు జరగనుంది. యశోభూమి, గ్రేటర్ నోయిడాలోని ఇండియా ఎక్స్‌పో సెంటర్%ు%మార్ట్ వేదికల్లో ఎక్స్‌పో కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు.

## కేంద్ర ఉద్యోగులకు శుభవార్త

8వ వేతన సవరణ సంఘం ఏర్పాటుకు మోదీ సర్కార్ పచ్చజెండా

రూ.3,984 కోట్లతో శ్రీహరికోటలో మూడో లాంచ్‌ప్యాడ్ ఏర్పాటు

కేంద్ర క్యాబినెట్ నిర్ణయాలు వెల్లడించిన అశ్వినీ వైష్ణవ్

దిల్లీ: కోటీ పదిహేను లక్షల మంది ఉద్యోగుల, పింఛనుదారుల.. జీతాలు, పింఛన్లు పెంచేందుకు 8వ వేతన సంఘం(పే కమిషన్) ఏర్పాటు చేస్తున్నట్లు గురువారం కేంద్రం ప్రకటించింది. ఈ నిర్ణయానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆమోదముద్ర వేశారని కేంద్ర సమాచార, ప్రసార శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్ దిల్లీలో విలేకర్ల సమావేశంలో వెల్లడించారు.

ప్రస్తుత 7వ వేతన సవరణ సంఘం కాలపరిమితి 2026తో ముగుస్తోంది. ఈ నేపథ్యంలో ఆ తర్వాత కొత్త వేతన సవరణ అమలు చేయడానికి వీలుగా 8వ పే కమిషన్ ఏర్పాటుకు ప్రధాని మోదీ నేతృత్వంలో దిల్లీలో సమావేశమైన కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. కమిషన్ ఛైర్‌పర్సన్, ఇద్దరు సభ్యుల పేర్లను త్వరలో ప్రకటించనున్నట్లు వెల్లడించారు. వేతన సవరణ అమల్లోకి రావడానికి ఇంకా ఏడాదికిపైగా సమయం ఉన్నందున ఈ సంఘం భాగస్వాములందరితో విస్తృత సంప్రదింపులు జరిపి సిఫార్సులు చేస్తుందని అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.

### 48 నెలల్లో బాహుబలి లాంచ్‌ప్యాడ్

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట ఇస్రో సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రంలో రూ.3,984.86 కోట్ల అంచనా వ్యయంతో మూడో లాంచ్‌ప్యాడ్ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర మంత్రివర్గ సమావేశం ఇందుకు ఆమోదముద్ర వేసింది. దీని ఏర్పాటు 48 నెలల్లో పూర్తికానుంది. అంతరిక్ష మౌలికవసతుల విభాగంలో ఇదో గొప్ప మైలురాయిగా నిలుస్తుందని కేంద్ర సమాచార, ప్రసారశాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. తొలి రెండు లాంచ్‌ప్యాడ్‌ల కంటే అత్యధిక సామర్థ్యంతో దీన్ని ఏర్పాటు చేయనున్నారు. రాకెట్ల శక్తిసామర్థ్యాలను దృష్టిలో ఉంచుకొని ఈ ప్యాడ్‌ను నెలకొల్పుతారు. మూన్‌మిషన్, అంతరిక్షంలో భారత్ స్టేషన్ ఏర్పాటు లక్ష్యాలకు అనుగుణంగా దీని ఏర్పాటు జరుగనున్నట్లు అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఈ ప్యాడ్ నుంచి కేవలం ఎన్‌జీఎల్‌వీ (నెక్స్ట్ జనరేషన్ లాంచ్ వెహికిల్) మాత్రమే కాకుండా లాంచ్‌వెహికిల్ మార్క్-3కూడా ప్రయోగించే వీలు




ఉంటుంది. దీనివల్ల భారతీయ అంతరిక్ష వ్యవస్థ పురోగమనానికి మరింత ఊతం లభిస్తుంది. ఇకమీదట ప్రయోగాల సంఖ్య పెరుగుతుంది. ఇప్పటి వరకు భారతీయ అంతరిక్ష రవాణా వ్యవస్థ మొత్తం రెండు లాంచ్‌ప్యాడ్‌ల మీదే ఆధారపడి ఉంది. తొలి లాంచ్‌ప్యాడ్‌ను 30 ఏళ్ల క్రితం పీఎస్ఎల్వీల కోసం ఏర్పాటు చేశారు. దాని ద్వారానే పీఎస్ఎల్వీ, ఎస్ఎస్ఎల్వీలను ప్రయోగిస్తూ వస్తున్నారు. రెండో లాంచ్‌ప్యాడ్ జీఎస్ఎల్వీ, ఎల్వీఎం3ల కోసం ఏర్పాటు చేశారు. ఇది అందుబాటులోకి వచ్చి కూడా 20 ఏళ్లకుపైగానే అయింది. ఇక్కడి నుంచే చంద్రయాన్-3 మిషన్‌తోపాటు, పీఎస్ఎల్వీ/ఎల్వీఎం3 లాంటి వాణిజ్య మిషన్స్ కూడా ప్రయోగించారు. ఇక్కడి నుంచే గగన్‌యాన్ మిషన్ కూడా మొదలుపెట్టడానికి సిద్ధమవుతున్నారు. 2035 నాటికి భారతీయ అంతరిక్ష కేంద్రం, 2040 నాటికి భారతీయ బృందంతో కూడిన లూనార్ ల్యాండింగ్ లక్ష్యాన్ని చేరుకోవాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నందున మూడో లాంచ్‌ప్యాడ్ అవసరం అవుతోంది. ఇప్పుడున్న రెండు ప్యాడ్‌ల ద్వారా కొత్తతరం భారీ వాహనాల ప్రయోగం సాధ్యం కాదన్నది ప్రభుత్వ ఉద్దేశం. దీనివల్ల వచ్చే 25-30 ఏళ్లలో రాబోయే మార్పులకు అనుగుణంగా రవాణా అవసరాలను తీర్చడానికి వీలవుతుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది.

### వేతన సంఘం అంటే?

దేశంలో గల సుమారు 50 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 65 లక్షల మంది పింఛనుదారుల వేతనాలు, భత్యాలు ఎంత ఉండాలో నిర్ణయించడంలో వేతన సంఘం కీలక పాత్ర పోషిస్తుంది. ప్రస్తుత ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతమున్న జీతాలు, పింఛన్లను ఎంత మేర పెంచాలో ప్రభుత్వానికి సిఫార్సు చేస్తుంది. ఈ నివేదిక ఆధారంగా కేంద్ర ప్రభుత్వం వేతన సవరణ చేపడుతుంది.

## సింగపూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన.. ఆ దేశ విదేశాంగ మంత్రితో భేటీ

మొదటిపేజీ తరువాయి

ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ భేటీలో పాల్గొన్నారు. గురువారం రాత్రి రేవంత్‌రెడ్డి బృందం దిల్లీ నుంచి బయలుదేరి సింగపూర్ వెళ్లింది. శుక్రవారం ఉదయం వివియన్ బాలకృష్ణన్‌తో వారు భేటీ అయ్యారు. ఆ దేశంలోని అభివృద్ధి పనులతో పాటు తెలంగాణలోని ప్రణాళికలపై ప్రధానంగా చర్చించారు. రాష్ట్రంలో కొత్తగా ప్రారంభమైన క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ, దానికున్న అవకాశాలపై చర్చ జరిపారు. సింగపూర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు, రాష్ట్రంలో జరుగుతున్న అంశాలను పోల్చి చూశారు. నిధుల సమీకరణ గురించి సమాలోచనలు చేశారు.

రాష్ట్ర బృందం శని, ఆదివారాల్లో కూడా సింగపూర్‌లో పర్యటించనుంది. చాంగి నగరంలో సింగపూర్ స్కిల్ యూనివర్సిటీ ఉంది. రాష్ట్రంలో కూడా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయబోతున్న నేపథ్యంలో ఆ దేశంలోని కోర్సులు, ప్రణాళికలు, నిర్వహణ విధానంపై అధ్యయనం చేయనున్నారు. వీటిపై ఒప్పందాలు జరిగే అవకాశం ఉంది. సింగపూర్‌లోని పారిశ్రామికవేత్తలు, ప్రవాస భారతీయులతో కూడా సీఎం రేవంత్‌రెడ్డి భేటీ కానున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై చర్చించనున్నారు.

ఈ పర్యటన అనంతరం రాష్ట్ర బృందం దావోస్ వెళ్లనుంది. ప్రపంచ ఆర్థిక ఫోరం సదస్సులో పాల్గొననుంది. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను సీఎం ఈ వేదికపై వివరించనున్నారు. గతంలో సుమారు రూ.40 వేల కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చిన నేపథ్యంలో.. ఈసారి మరింత ఎక్కువ పెట్టుబడులు తీసుకురావాలనే యోచనలో ఉన్నారు. హైదరాబాద్‌ను ఫ్యూచర్ సిటీగా ఫోకస్ చేయడంతో పాటు కొత్తగా తెచ్చిన క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీని వివరించనున్నారు.

## అఫ్జల్‌గంజ్‌లో కాల్పులు.. రిఅమిత్ కుమార్ గ్యాంగ్ కోసం పోలీసుల వేట

మొదటిపేజీ తరువాయి

బిహార్ పోలీసులను సంప్రదించిన నగర పోలీసు ఉన్నతాధికారులు అమిత్‌కుమార్ నేరాల చిట్టా గురించి ఇప్పటికే తెలుసుకున్నట్టు సమాచారం.

బీభత్సం సృష్టించిన అమిత్ గ్యాంగ్..

అమిత్ ముఠా కర్ణాటకలోని బీదర్, ఆ తర్వాత హైదరాబాద్‌లో కాల్పులతో బీభత్సం సృష్టించారు. బీదర్‌లో ఏటీఎంలో డబ్బులు నింపేందుకు వచ్చిన ఇద్దరు సెక్యూరిటీ సిబ్బందిపై కాల్పులు జరిపి నగదుతో ద్విచక్ర వాహనంపై పరారై హైదరాబాద్‌లో ప్రత్యక్షమయ్యారు. అఫ్జల్‌గంజ్ నుంచి ప్రైవేటు ట్రావెల్స్‌లో రాయ్‌పుర్ వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలోనే ట్రావెల్స్ సిబ్బంది బ్యాగులు తనిఖీ చేయడం, కట్టలకొద్దీ డబ్బును చూసి అనుమానంతో ప్రశ్నించడంతో నిందితులు ఒకరిపై రెండు రౌండ్ల కాల్పులు జరిపి పరారయ్యారు. బీదర్‌లో జరిపిన కాల్పుల్లో ఒకరు మరణించగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. హైదరాబాద్‌లో జరిపిన కాల్పుల్లో ఒకరు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సినీఫక్కీలో జరిగిన ఈ ఘటనలతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. రెండు చోట్లా అత్యంత రద్దీ ప్రదేశాల్లో ఆగంతుకులు ఇంతటి తెగింపు ప్రదర్శించడం గమనార్హం.

## భాష మార్చుకోవాల్సింది నేను కాదు..సీఎం రేవంత్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి

తాను అన్నింటికీ సమాధానం ఇచ్చానని, తన స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేశారని వెల్లడించారు. రేవంత్ రెడ్డి ఎన్ని కేసులు పెట్టినా భయపడేదే లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ 420 హామీలు, 6 గ్యారంటీలపై ప్రశ్నిస్తూనే ఉంటానని వెల్లడించారు.

డిసెంబర్ 4న ఫిర్యాదు చేయడానికి బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లానని తెలిపారు. ఏసీపీ అపాయింట్‌మెంట్ తీసుకునే అక్కడికి వెళ్లానన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, ఇంటెలిజెన్స్ ఐజీ శివధర్ రెడ్డి తన ఫోన్‌ను ట్యాపింగ్ చేస్తున్నారని ఫిర్యాదు చేయడానికి వెళ్తే తనపైనే తప్పుడు కేసులు పెట్టారని చెప్పారు. తాను ఇచ్చిన ఫిర్యాదుపై ఇప్పటివరకు ఎందుకు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని ప్రశ్నించారు. ఒక రౌడీషీటర్ ఇచ్చిన ఫిర్యాదుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావుపై కేసు నమోదుచేశారని చెప్పారు. కానీ బాధ్యతకలిగిన ఎమ్మెల్యేగా తాను ఫిర్యాదు చేస్తేమాత్రం కంప్లైంట్ ఫైల్ చేయలేదన్నారు. పోలీసులే ముందుండి కాంగ్రెస్ గూండాలతో దాడి చేయిస్తున్నారని ఆరోపించారు. పండుగ రోజు కూడా తనను దొంగలా అరెస్టు చేశారని మండిపడ్డారు. భాష మార్చుకోవాల్సింది తాను కాదని, సీఎం రేవంత్ రెడ్డేనని చెప్పారు.

## ఇంటర్ విద్యార్థులకు అలర్ట్.. 25వ తేదీ వరకు ఫీజు చెల్లింపునకు అవకాశం

మొదటిపేజీ తరువాయి

మిక్స్‌డ్ ఆక్యుపెన్సీ భవనాల్లో ఉన్న ప్రైవేట్ జూనియర్ కాలేజీలకు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి మినహాయింపు ఇచ్చిన సంగతి తెలిసిందే. 2024-25 విద్యాసంవత్సరానికిగానూ ఫైర్ నిరభ్యంతర పత్రం(ఎన్‌వోసీ) నుంచి మినహాయింపు ఇచ్చింది. ఈ మేరకు హెూంశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రవి గుప్తా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మిక్స్‌డ్ ఆక్యుపెన్సీ కాలేజీలకు అనుమతివ్వాలన్న ప్రైవేట్ కాలేజీల విజ్ఞప్తితో ఈ ఒక విద్యాసంవత్సరానికి అనుమతినిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ నిర్ణయంతో దాదాపు 217 కాలేజీల్లోని 70 వేల మంది విద్యార్థులకు ఊరట కలిగింది.ంఈ క్రమంలో ఆ విద్యార్థులు విద్యా సంవత్సరం కోల్పోవద్దనే ఉద్దేశంతో వార్షిక పరీక్షల ఫీజు చెల్లించేందుకు ఇంటర్ బోర్డు అవకాశం కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. ఇక ఇంటర్ వార్షిక పరీక్షలను మార్చి 5 నుంచి 25 వరకు నిర్వహించనున్నారు. ఫస్టియర్ విద్యార్థులకు మార్చి 5 నుంచి, సెకండియర్ విద్యార్థులకు మార్చి 6 నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రతి రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలను నిర్వహించనున్నారు.

# చికి చికి బం బం చికి చికి బం బం

# ధర పెరిగిన మందును వదలములే


**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**

తెలంగాణలో చివరిసారిగా గతంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నపుడు మద్యం ధరలు పెంచారు. గడిచిన 4 ఏళ్లుగా రాష్ట్రంలో మద్యం ధరలు పెంచలేదని ఇటీవల యునైటెడ్ బేవరేజస్ కంపెనీ లిమిటెడ్.. తెలంగాణ ప్రభుత్వానికి ఒక లేఖ రాసింది. మద్యం ధరలను పెంచడంతో పాటు.. మద్యం విక్రయాలపై తమకు ఇచ్చే మార్జిన్‌ను కూడా పెంచాలని ఆ సంస్థ సర్కారుకు రాసిన లేఖలో స్పష్టం చేసింది. అయితే మద్యం ధరలు పెంచాలని.. మద్యం కంపెనీల నుంచి వస్తున్న విజ్ఞప్తుల నేపథ్యంలో.. తెలంగాణ ప్రభుత్వం హైకోర్టు మాజీ న్యాయమూర్తి ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యుల కమిటీని 6 నెలల క్రితమే ఏర్పాటు చేసింది. ఈ కమిటీ తొలిసారి జూలై 18వ తేదీన సమావేశమైంది.ఈ పరిణామాల నేపథ్యంలో తెలంగాణలో మద్యం ప్రియులకు ప్రభుత్వం బ్యాడ్‌న్యూస్ చెప్పనుంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది దాటిపోయింది. అయితే గత 4 ఏళ్లుగా రాష్ట్రంలో మద్యం ధరలు పెంచకుండా స్థిరంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే సదరు మద్యం కంపెనీలు.. మద్యం ధరలు పెంచాలని




ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తున్నాయి. దీంతో రాష్ట్రంలో మద్యం ధరలు పెంచాల్సిన అవసరం ఏర్పడినట్లు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. అయితే మద్యం ధరల పెంపుపై రేవంత్ రెడ్డి సర్కార్ కీలక కసరత్తులు చేస్తోంది. ఏ విధంగా మద్యం ధరలు పెంచాలి అనే దానిపై సమాలోచనలు చేస్తోంది. ఈ నేపథ్యంలోనే 6 నెలల క్రితం ఏర్పాటు చేసిన హైకోర్టు మాజీ న్యాయమూర్తి కమిటీ ఇచ్చిన నివేదికను పరిశీలించి.. మద్యం ధరల పెంపుపై ఒక నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

అయితే మద్యం మార్కెట్‌లో దాదాపు 60 శాతం వాటా ఉన్న యూబీ బీర్ల కంపెనీ.. తమకు ప్రస్తుతం చెల్లిస్తున్న బేసిక్ ధర మీద కనీసం 33 శాతం అదనంగా చెల్లించాలని కోట్ చేసింది. ఇక డిమాండ్‌ను ఇతర కంపెనీలు చేస్తున్నాయి. అయితే 2023లోనే బేసిక్ ధర పెంచాలని మద్యం కంపెనీలు కోరగా అప్పటి ప్రభుత్వం తిరస్కరించింది. ఇప్పటికే మద్యం ధరల పెంపునకు సంబంధించి రూ.10 నుంచి రూ.20 వరకు పెంచే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో బీర్ల ధరలు తక్కువగా ఉన్న నేపథ్యంలో.. వాటి ధరలు పెంచాలని ప్రభుత్వానికి ఎక్సైజ్ అధికారులు ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం.




ఇక రాష్ట్రంలో ప్రముఖ కంపెనీల బీర్ల కొరత ఉన్నట్లు మద్యం షాపు యజమానులు చెబుతున్నారు. అయితే కింగ్ ఫిషర్ బీర్ల కొరతను అధిగమించేలా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ భావిస్తోంది. ఇందుకోసం మిగతా 5 బీర్ల కంపెనీలతో ఎప్పటికప్పుడు చర్చలు జరుపుతోంది. ఈ నేపథ్యంలోనే యునైటెడ్ బ్రేవరేస్ లిమిటెడ్ ఉత్పత్తి చేసే కింగ్‌ఫిషర్, కింగ్‌ఫిషర్ స్ట్రాంగ్, కింగ్‌ఫిషర్ అల్ట్రా, కింగ్‌ఫిషర్ అల్ట్రా మ్యాక్స్‌లు మినహా.. మిగతా బీర్లను మద్యం డిపోల్లో అందుబాటులో ఉంచాలని ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు బ్రేవరేజెస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఇక కింగ్ ఫిషర్ బీర్లు కేవలం 2 వారాలకు మాత్రమే సరిపడా నిల్వలు ఉండడంతో వాటిని జాగ్రత్తగా మద్యం షాపులకు కేటాయించాలని ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు సూచించినట్లు తెలుస్తోంది. ఇక కింగ్ ఫిషర్ బీర్ల సరఫరాను నిలిపివేస్తున్నట్లు 10 రోజుల క్రితమే యూబీఎల్ కంపెనీ సంచలన ప్రకటన చేసింది. ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు రాకపోవటం.. ధరలు పెంచాలన్న కంపెనీ నిర్ణయానికి ప్రభుత్వం అంగీకరించకపోవటంతో బీర్ల సరఫరాపై తీవ్ర సందిగ్ధం నెలకొంది.

## సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన

**ఆకుల రంజిత్,కరపత్రం ప్రతినిధి**

సంక్షేమ పథకాలు అమలు పే రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తున్నదని జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండల భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు బాయి లింగరెడ్డి అన్నారు.శుక్రవారం ఆయన మాట్లాడుతు, తెలంగాణ రాష్టం లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడుస్తున్నా రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ళు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లతో పాటు కొత్త రేషన్ కార్డులు తదితర సంక్షేమ పథకాలు అమలు చేయటం లో విఫలమైందని, కాలయపనతో రాష్ట్ర ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు.ఇప్పుడు కొత్తగా సర్వే పేరుతో



రేషన్ కార్డుల మీద నిబంధనలు పెట్టడమేమిటని అన్నారు. గత 11 సంవత్సరంల నుండి రేషన్ కార్డు గత ప్రభుత్వం ఇవ్వలేదని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడ గత ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్న వారికే ఇస్తాం అనడం విడ్డూరంగా ఉందని ,కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఇంటికి కొత్తగా రేషన్ కార్డు లు ఇవ్వాలని, రేషన్ కార్డుల విషయంలో ఏ నిబంధనలు పెట్టినా ప్రజల పక్షాన ఉద్యమం చేస్తామని, ఇబ్రహీంపట్నం మండలం లో జరుగుతున్న ఇంటింటి సర్వేలో రేషన్ కార్డు కొరకు దరఖాస్తులు తీసుకోవాలి అని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సౌజన్యం అంకతి భరత్

## మెట్ పల్లి విద్యార్థినికి జిల్లా స్థాయి ప్రథమ బహుమతి

**ఆకుల రంజిత్, కరపత్రం ప్రతినిధి**



సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో “మనీ కమ్స్ అండ్ గోస్ - మొరాలిటీ కమ్స్ అండ్ గ్రోస్” అన్న అంశంపై నిర్వహించిన వ్యాస రచన పోటీలలో భాగంగా జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బి.కామ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని మంగలపల్లి ప్రతిభ కు జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి అందుకుందని నిర్వాహకులు కళాశాలకు శుక్రవారం రోజున సమాచారం ఇచ్చారు.

ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మరియు వైస్ ప్రిన్సిపాల్ లు డాక్టర్ కె. వేంకయ్య, తొంటి దేవన్న, కళాశాల అకాడమిక్ కో - ఆర్డినేటర్ బిల్ల రాజేందర్, కామర్స్ హెచ్.ఓ.డి మనోజ్ కుమార్ లతో పాటు లెక్చరర్లు గట్టయ్య, అంజయ్య, శ్రీకాంత్, సత్తయ్య, బోధనేతర సిబ్బంది,విద్యార్థినీ విద్యార్థులు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ప్రథమ బహుమతి లభించినందుకు ప్రతిభను ప్రత్యేకంగా అభినందించారు.

## నర్సాపూర్ కేంద్రంలో నవోదయ ప్రవేశ ఎంపిక పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

- ప్రభుత్వం నిర్వహిస్తున్న నవోదయ ప్రవేశ పరీక్షకు సర్వం సిద్ధం
- క్లస్టర్ లెవెల్ అధికారి డా. రవి
- బ్లాక్ లెవెల్ అధికారి డి. తారా సింగ్

**కరపత్రం దినపత్రిక సంగారెడ్డి జిల్లా/ మెదక్ జిల్లా**

జవహర్ నవోదయవిద్యాలయం వర్గల్ లో2025-26 విద్యా సంవత్సరానికి ఆరవ తరగతిలో ప్రవేశాలకు ఎంపిక పరీక్ష నిర్వహించేందుకు ఈరోజు ఏర్పాటు చేయడం జరిగింది ఏర్పాట్లను పరిశీలించడానికి క్లస్టర్ లెవెల్ అధికారి డా. రవి, బ్లాక్ లెవెల్ అధికారి డి. తారా సింగ్ కేంద్రాన్ని సందర్శించి పర్యవేక్షణ చేయడం జరిగింది. మెదక్ జిల్లా నర్సాపురం బ్లాక్ లెవెల్ లో రెండు పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. జడ్పీహెచ్ఎస్ బాయ్స్ నర్సాపూర్ 216 మంది విద్యార్థులు, విష్ణు హై స్కూల్ నర్సాపూర్ పరీక్షా కేంద్రంలో 173 మంది విద్యార్థులు, మొత్తము 389 మంది విద్యార్థులు పరీక్ష



రాస్తున్నారు. ఉదయము 11 గంటల నుండి మధ్యాహ్నం 1:30 నిమిషాల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి డి తారా సింగ్ గారు తెలిపారు.

1.పరీక్షా కేంద్రానికి ఉదయం 10:30 నిమిషాలకు చేరుకోవాలి
2. పరీక్ష వ్యవధి రెండు గంటలు
3.1:30 నిమిషాల కంటే ముందు హాలు నుండి బయటకు వెళ్లకూడదు.
4. అడ్మిట్ కార్డు తప్పనిసరిగా ఉండాలి.



5.నీలము /నలుపు బాల్ పాయింట్ పెన్ను మాత్రమే ఉపయోగించాలి.
5. మొత్తము 80 ప్రశ్నలుంటాయ
6.ఎలక్ట్రానిక్ పరికరాలు.అనుమతించబడవు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు విట్టల్, ఉపాధ్యాయులు సామ్య నాయక్, శ్రీనివాస్ , గుంపస్వామి , సుధాకర్, పరమేశ్వరి మొదలైన ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## అల్వాల్ నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవల పునఃప్రారంభం

- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వైద్యఆరోగ్య అధికారి
- డా. టి. రఘునాథ్ స్వామి

**కరపత్రం దినపత్రిక మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి. జనవరి 17**



జిల్లాఅభివృద్ధి, సమన్వయం మానిటరింగ్ కమిటీ (డి ఐ ఎస్ హెచ్ ఏ ) సమావేశంలో జరిగిన చర్చల ప్రకారం అందించిన సూచనల మేరకు జిహెచ్ఎంసి హాల్, వెంకటాపూర్ లో ప్రస్తుతము పనిచేస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించే పిల్లలు, గర్భిణీలు, వృద్ధులకు ఎదురవుతున్న సమస్యల దృష్ట్యా, ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు జిల్లా వైద్య మరియు ఆరోగ్య కార్యాలయం చర్యలు తీసుకుంది.అల్వాల్ లో నూతనంగా నిర్మించిన భవనంలో వైద్య సేవలను పునఃప్రారంభించి, అన్ని రోగులకుఅందుబాటులో ఉంచినట్లు తెలిపారు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డా. టి. రఘునాథ్ స్వామి ప్రకటించారు.ఈ సౌకర్యంలో పిల్లలు, గర్భిణీలు, మరియు వృద్ధులకు మరియు సామాన్య ప్రజలకు అవసరమైన వైద్య సేవలను సౌకర్యవంతమైన విధానంలో అందించడానికి అన్ని ఏర్పాట్లు చేశారు అని పేర్కొన్నారు .జిల్లా వైద్య మరియు ఆరోగ్య కార్యాలయం ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలను అందించడానికి కట్టుబడి ఉన్నది మరియు అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న ఈ సదుపాయాలను ఉపయోగించుకోవాలని ప్రజలను అభ్యర్థించారు.

## ఉద్యోగులకు క్వార్టర్ల కేటాయింపు కొరకు కౌన్సిలింగ్

**కరపత్రం రామగిరి ప్రతినిధి జనవరి 17**

రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు గారి ఆదేశాల మేరకు రామగుండం-3 & అడ్రియాల ప్రాజెక్టు ఏరియాలలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు సెంటినరీ కాలనీలో గల క్వార్టర్ల కేటాయింపు కొరకు శుక్రవారం నాడు సెక్యూరిటీ కార్యాలయ ఆవరణలో క్వార్టర్ల కేటాయింపు కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగింది. మొత్తము 175 ఖాళీ క్వార్టర్లు ఉండగా, ఫ్రెష్ అలాట్మెంట్, చేంజ్ ఆఫ్ క్వార్టర్ల కొరకు 61 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకోగా, 26 మంది ఉద్యోగులు హాజరై, 21 మంది క్వార్టర్లను ఎంపిక చేసుకున్నారు. వారికి త్వరలోనే క్వార్టర్ల కేటాయింపు పత్రాలు ఇస్తామని ఎస్వోటుజియం జి.రఘుపతి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు యం.రామచంద్రారెడ్డి, సాయికృష్ణ, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, సివిల్ డిజియం రాజేంద్ర కుమార్, ఎస్టేట్స్ అధికారి కె.ఐలయ్య, డి.పి.ఎం.గుర్రం శ్రీహరి, క్వార్టర్ల విభాగం సిబ్బంది మహేందర్, సదయ్య తదితరులు పాల్గొన్నారు.

## కారుణ్య నియామకాల ఉత్తర్వుల అందజేత

**కరపత్రం రామగిరి ప్రతినిధి జనవరి 17**

రామగుండం-3 ఏరియాలోని వివిధ గనులు, విభాగాలలో విధులు నిర్వహిస్తూ అనారోగ్య కారణాల వల్ల మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన, మృతి చెందిన ఉద్యోగులకు సంబంధించిన 10 మందికి కారుణ్య నియామక ఉద్యోగాల ఉత్తర్వులను శుక్రవారం జి.ఎం. కార్యాలయంనందు నిర్వహించిన కార్యక్రమంలో రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకర రావు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివినప్పటికీ ప్రభుత్వ ఉద్యోగానికి ఉన్న ప్రాధాన్యతను గుర్తించి సింగరేణి సంస్థలో బదిలీ వర్కర్ ఉద్యోగంలో చేరుతున్నారని, అయితే ఆ స్థాయికి తగ్గట్టుగా పని చేస్తూ, అధికారులు, సూపర్ వైజర్ల ఆదేశాలను పాటిస్తూ అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ, భద్రతతో విధులు నిర్వహించాలని కోరారు.

# పార్టీ మహాసభలను జయప్రదం చేయండి.



కరపత్రం దినపత్రిక మెదక్ నర్సాపూర్.

**- నర్సాపూర్ లో పార్టీ జెండా ఆవిష్కరించిన కదారి నాగరాజు.**
**- 25 బహిరంగ సభకు అధిక సంఖ్యలో హాజరుకావ్వాలని పిలుపు.**

ఉమ్మడి జిల్లా సంగారెడ్డిలో నిర్వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు జనవరి 25 - 28 వరకు నిర్వహిస్తున్నట్లు మహాసభలా జయప్రదానికి రాష్ట్ర వ్యాప్తంగా ఈ రోజు జెండా ఆవిష్కరణ చేయాలనీ పార్టీ పిలుపుమేరకు నర్సాపూర్ లో జెండా ఆవిష్కరించినట్లు సిపిఎం నర్సాపూర్ డివిజన్ కార్యదర్శి కదారి నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న అనేక ప్రజా కార్మిక సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తున్న ఏకైక పార్టీ %జూవీ% అన్నారు. ఎక్కడ భూమి సమస్యలు ఉన్న, రైతు, వ్యవసాయ కూలీల, కార్మిక కనీసవేతనాలు, నిరుద్యోగ యువత, విద్యార్థి ఉద్యమాలకు ఊపిరిపోస్తున్న పార్టీ అని గుర్తుచేశారు. ఈ మహా సభలలో భవిష్యత్తు కాలంలో ప్రజా ప్రయోజనాలకోసం నిరంతరం ఉద్యమ కార్యాచరణ చర్చించి తీర్మాణాలు చేసి పోరాటాలకు సిద్ధం కాభోతుందని తెలిపారు. ప్రజా, కార్మిక, వ్యవసాయ కూలీల, అనేక సమస్యలపై నిరంతరం పోరాటాలు చేసే సిపిఎం మహాసభలను జయప్రదం చేయాలనీ పిలుపునిచ్చారు. ఈ మహాసభలు పోలిటీబ్యూరో సభ్యులు బృందకరత్, బీవీ రాఘవులు, జాతీయ నేతలు నాగయ్య, సాయిబాబా తదితరులు వస్తున్నారని పెద్ద సంఖ్యలో 25నా నిర్వహించే బహిరంగ సభకు పెద్ద ఎత్తున ప్రజలు, కార్మికులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నలని కోరారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమం లో నాఘభూషణం, శూఖుర్, నర్సింలు, మల్లేశం, ప్రవీణ్, రమేష్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనల ప్రకారం ఇసుక రవాణా జరగాలి

## జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝు..

వేములవాడ న్యూస్ అప్డేట్స్ : కరపత్రం



రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రభుత్వ నిబంధనలు అనుసరించి మాత్రమే ఇసుక రవాణా జరిగే విధంగా అధికారులు పకడ్బందీ పర్యవేక్షణ ఉంచాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝు సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఇసుక రవాణ పై అధికారులతో జిల్లా స్థాయి సాండ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిరిసిల్ల ఆర్డీవో వెంకట ఉపేందర్ రెడ్డి, మైనింగ్ అధికారి క్రాంతి కుమార్, డీ.ఆర్డీ.ఓ శేషాద్రి, జిల్లా ఇరిగేషన్ అధికారి అమరేందర్ రెడ్డి, సర్వే ఏడీ వినయ్ కుమార్, మిషన్ భగీరథ ఈఈ జానకి, సిరిసిల్ల తహసిల్దార్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి వారి వైద్య శిభిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి .

**- ఏరియా జనరల్ మేనేజర్ బి.వెంకటయ్య**

కరపత్రం రామగిరి ప్రతినిధి జనవరి 17

కమాన్ పూర్ మండలం పెంచికలపేట గ్రామంలో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 18న తలపెట్టిన ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సింగరేణి సంస్థ రామగుండం రీజియన్ 2 జనరల్ మేనేజర్ బి వెంకటయ్య కోరారు. ఆర్జీ-2 ఏరియా వకిల్ పల్లి గనికి సంబంధించి జరిగిన ప్రజా అభిప్రాయ సేకరణలో వచ్చిన అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోని రేమేడియేషన్ మేషర్స్ క్రింద వైద్య శిభిరాలను ఏర్పాటు చేయడంలో బాగంగా వకిల్ పల్లి ప్రాజెక్ట్ ప్రభావిత గ్రామమైన గ్రామ ప్రజలకు ఈనెల తేది:-18 శనివారం రోజున ఉ. 9 గం.ల నుండి పెంచికల్ పేట్ కమ్యూనిటీ హాల్ నందు ఆర్జీ-2 ఏరియా సింగరేణి యాజమాన్యం ఆద్వర్యంలో ఉచిత వైద్య శిభిరం ఏర్పాటు చేయడం జరుగుతుందని మరియు జూట్ బ్యాగుల శిక్షణను కూడా ప్రారంభించడం జరుగుతుందని ఏరియా జనరల్ మేనేజర్ బి.వెంకటయ్య పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు.

ఈ ఉచిత వైద్య శిభిరంలో నిష్ణాతులైన సింగరేణి వైద్యులచే వైద్య పరిక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇవ్వడం జరుగుతుందని డిజిఎం పర్సనల్ %డ% అధికార ప్రతినిధి ఎస్.అనిల్ కుమార్ గారు తెలిపారు.

కావున పెంచికల్ పేట్ గ్రామానికి చెందిన ప్రజలు ఎక్కువ మంది హాజరై ఆర్జీ-2 ఏరియా సింగరేణి సంస్థ కల్పిస్తున్న ఉచిత వైద్య శిభిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు.

## పత్రికల్లో నిర్భయంగా వార్తల రాయాలి.

**- తాసిల్దార్ వాసంతి ఎంపీడీవో లలిత.**

కరపత్రం రామగిరి ప్రతినిధి జనవరి 17.



పత్రికల్లో వార్తలను నిజాలను నిర్భయంగా వ్రాయాలని కమాన్ పూర్ తహసిల్దార్ వాసంతి ఎంపీడీవో జీ లలిత అన్నారు. కమాన్ పూర్ మండల కేంద్రంలో ప్రజా క్రాంతి దినపత్రిక క్యాలెండర్ను తాసిల్దార్ వాసంతి ఎంపీడీవో జీ లలితలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు సమాజంలో పత్రికలకు ఎంతో విలువ ఉందని ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉంటూ ఎన్నో వార్తా ప్రసారాలను చేయడం జరుగుతుందని అన్నారు. ప్రజలకు ఉపయోగపడే వార్తలు రాయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్, జూలపల్లి మాజీ ఎంపీటీసీలు, బొల్లంపల్లి తిరుపతి గౌడ్, సేవ్వ శంకరయ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సిలారం మల్లయ్య, మండల బిజెపి అధ్యక్షుడు కొయ్యడ సతీష్, జంగేపల్లి అజయ్, అన్నవేళ లక్ష్మీరాజం, ఆటో యూనియన్ అధ్యక్షుడు మట్ట నరసయ్య, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు దాసరి రామస్వామి, అంబటి కనకయ్య, గుండారం గ్రామ కార్యదర్శి బచ్చల భాస్కర్, ఇనగంటి ప్రభాకర్ రావు, గుర్రాల చంద్రమౌళి, రాజమల్లు , కోలేటి రమేష్, పాత్రికేయుడు జబ్బార్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి ఓ అబద్ధాలకోరు

**- బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్ రావు**



కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జనవరి 17

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఓ అబద్ధాల కోరు అని బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్ రావు ఆరోపించారు. 6 గ్యారెంటీల పేరిట 420 హామీలు ఇచ్చి తెలంగాణలో ఆదికారింలోకి వచ్చిన తర్వాత రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజలను మోసం చేశాడని సంపత్ రావు తీవ్రంగా దుయ్యబట్టాడు. ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో నిన్న రేవంత్ రెడ్డి అక్కడి ప్రజలకు అనేక రకాల అమలు కానీ హామీలు ఇచ్చి వాటి అమలు బాధ్యత తనదేనని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైన రేవంత్ రెడ్డి అక్కడి ప్రజలకు ఏ రకంగా గ్యారంటీ ఇస్తాడని సంపత్ రావు ప్రశ్నించాడు. తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాలు ఢిల్లీ ప్రజలకు తెలుసని, రేవంత్ రెడ్డి హామీలను నమ్మే పరిస్థితిలో ఢిల్లీ ప్రజలు లేరని సంపత్ రావు అన్నారు. గతంలో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ను లిక్కర్ కుంభకోణంలో అరెస్టు చేసినప్పుడు కాంగ్రెస్ పార్టీ అతనికి అండగా నిలబడి, రాజకీయ కక్షలో భాగంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కేజ్రీవాల్ ను అక్రమంగా అరెస్ట్ చేశారని గగ్గోలు పెట్టిన రేవంత్ రెడ్డి,(కాంగ్రెస్ పార్టీ) నిన్న ఢిల్లీలో ప్రెస్ మీట్ పెట్టి మరి లిక్కర్ స్కాం సూత్రధారి కేజ్రీవాల్ అని చెప్పడం జరిగిందని సంపత్ రావు గుర్తు చేశాడు. ఇప్పటికైనా కేజ్రీవాల్ విషయంలో కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి నిజం తెలుసుకున్నందుకు సంతోషమన్నారు. ఓట్లు, సీట్ల కోసం కాంగ్రెస్ పార్టీ ఎంతకైనా దిగజారుతుంది అనడానికి నిన్న రేవంత్ రెడ్డి ఢిల్లీలో మాట్లాడిన మాటలు నిదర్శనమని సంపత్ రావు ఆరోపించారు. మొన్న జరిగిన మహారాష్ట్ర,హరియన ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి అక్కడి ప్రజలకు అనేక రకాల హామీలు ఇచ్చారని, కానీ అక్కడి ప్రజలు కాంగ్రెస్ పార్టీకి, రేవంత్ రెడ్డికి కర్రు కాల్చి వాత పెట్టారని సంపత్ రావు గుర్తు చేశాడు. రేపు జరగబోయే ఎన్నికల్లో కూడా ఢిల్లీ ప్రజలు కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టడానికి సిద్ధంగా ఉన్నారని సంపత్ రావు అన్నారు. ఢిల్లీలో రాబోయేది బిజెపి ప్రభుత్వమేనని సంపత్ రావు జోస్యం చెప్పారు.

# జమ్మికుంటలో డప్పుల దండోరా

## .. ఫిబ్రవరి 7న వేయి గొంతులు లక్ష డప్పుల ప్రదర్శన

కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జనవరి 17






ఎస్సీవర్గీకరణఅమలుపరచాలని జమ్మికుంటలో డప్పుల దండోరా నిర్వహించారు. ఫిబ్రవరి7న హైదరాబాద్ లో జరిగే వెయ్యి గొంతులు లక్ష డప్పుల ప్రదర్శనలో మద్దతుగా పాల్గొంటామని తెలంగాణ ఉద్యమకారుడు పృథ్వీరాజ్ తెలిపారు.జమ్మికుంట పట్టణంలో జరిగిన కార్యక్రమం డప్పు కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షులు అంబాల ప్రభాకర్ మాదిగ అధ్యక్షత న జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నలిగంటి శరత్ మాదిగ మాట్లాడుతూ “ అంబేద్కర్ ఆశయాల సాధనలో భాగంగానే ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం చేస్తున్నామని అన్నారు. ఎస్సీ వర్గీకరణ జరిగితే ఏ కులానికి అన్యాయం జరగదు,జనాభా ప్రాతిపదికన ఎస్సీలలో ఉన్న అన్ని కులాలకు రిజర్వేషన్లు లభించి న్యాయం జరుగుతుందని అన్నారు. ఈ పోరాటం న్యాయమైంది కనుకనే సమాజం మొత్తం మద్దతుఇచ్చిందనిఅన్నారు.కానీ మాలలు తమకున్న రాజకీయ పలుకుబడితో ఎస్సీ వర్గీకరణను అడ్డుకోవడానికి నేడుబలంగాప్రయత్నిస్తున్నారని అన్నారు. ఆ అడ్డంకులను ఎదుర్కోవడానికి వెయ్యి గొంతులు - లక్ష డప్పులతో మండే మాదిగల గుండె చప్పుళ్ళును వినిపించడానికి శ్రీకారం చుట్టామని అన్నారు.మరొక్కసారి అన్ని సామాజిక వర్గాలలో ఉన్న కళా నేతలంతా ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి మద్దతుగా నిలబడాలని అన్నారు.ఫిబ్రవరి 7 న జరుగు వెయ్యి గొంతులు లక్ష డప్పులు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.ఈ సందర్భంలో కళానేతలు మాట్లాడుతూ “ ఎస్సీ వర్గీకరణ న్యాయం కాబట్టే మొదటి నుండి ఎమ్మార్పీఎస్ కు మద్దతు తెలుపుతున్నామని అన్నారు.తెలంగాణ ఉద్యమాన్ని విజయవంతం చేయడానికి ఎంతటి బలమైన పాత్రని కళానేతలు పోషించారో అదే విధంగా ఎస్సీ వర్గీకరణ పోరాటాన్ని విజయానికి చేర్చడానికి కూడా అదే పాత్రను పోషిస్తామని అన్నారు.ఎస్సీ వర్గీకరణ అమలు కోసం మరొక్కసారి గజ్జె కట్టి గళం విప్పి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని అన్నారు.ఎస్సీ వర్గీకరణ కోసం నూతన పాటలను రూపొందించి ప్రజల్ని మరింత చైతన్యం చేస్తామని అన్నారు.అందులో భాగంగా వెయ్యి గొంతులు లక్ష డప్పులు కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రంలోని కళాకారులంతా పాల్గొంటామని తెలిపారు.

# సింగరేణిలో భూసేకరణ పై యజమాన్యం దృష్టి

**- ఎస్టేట్ జీఎం నలజాల రాధాకృష్ణ**



కరపత్రం రామగిరి ప్రతినిధి జనవరి 17

సింగరేణిలో పలు ఓపెన్ కాస్ట్ ల విస్తీర్ణకు భూసేకరణ చేయడంపై యాజమాన్యం దృష్టిసారించిందని శుక్రవారం కొత్తగూడెం కార్పొరేట్ నుండి వచ్చిన ఎస్టేట్ జీఎం నలజాల రాధాకృష్ణ తెలిపారు. సెంటినరీ కాలనీ ఆర్జీ-3, గోదావరిఖనిలోని ఆర్జీ-1 జీఎంలు నరేంద్ర సుధాకర్ రావు, డి.లలిత్ కుమార్ లను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. భూ సేకరణ పై వారితో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్జీ-3 డివిజన్ ఓసీపీ-1 లో 330 హెక్టార్ల అటవీ శాఖ భూమి, ఓసీపీ-2లో 88 ఎకరాల పట్టా భూమి ,జీడికే-5 వ ఓపెన్ కాస్ట్ లో 103 ఎకరాల భూమికి అవార్డు పాస్ చేయడం జరిగిందని తెలిపారు. ఆర్.జీ-1 సుందిల్లలో 265 ఎకరాల భూమి మైనింగ్ లీజ్ కింద ఉందని, కొందరు వ్యక్తులు వాటిలో పంటలు పండిస్తున్నారని, దీనిని త్వరలో స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. మణుగూరు వీకే ఓపెన్ కాస్ట్ లో 928 హెక్టార్ల భూమి ఫేజ్-1 కింద క్లియరెన్స్ వచ్చిందని, ఫేజ్-2 కు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు.మణుగూరు ఓపెన్ కాస్ట్ కు 58 ఎకరాల అటవీ శాఖ భూమి, 160 హెక్టార్ల పట్టా భూమి, జె.కె ఓపెన్ కాస్ట్ లో 152 నుండి హెక్టార్ల భూమి, గోలేటి ఓపెన్ కాస్ట్ కి 615 హెక్టార్ల భూమి, శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ కు 200 హెక్టార్ల భూమి, ఆర్.కే ఓసీపీకి ఫేజ్-2 లో 365 హెక్టార్ల అటవీ శాఖ భూమి అవసరం ఉందని తెలిపారు. ఇతర ఓపెన్ కాస్ట్ లకు భూమి అవసరం ఉందని అన్నారు. ముఖ్యంగా సీ అండ్ ఎండీ నునావత్ బలరాం, డైరెక్టర్(పా) జి. వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో భూసేకరణ వేగవంతంగా పూర్తి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్టేట్ ఆఫీసర్ కనేవెన.ఐలయ్య, అడిషనల్ మేనేజర్ సురేష్, డిప్యూటీ మేనేజర్ శ్రీనివాస్,జూనియర్ ఎస్టేట్ ఆఫీసర్ ఆకుల శ్యామల ఉన్నారు.